

గోదావరి వరద తగ్గుముఖం పట్టలేదు.. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది..

5

తగ్గని గోదారి



లంకల నుంచి మత్స్యకారులను తరలిస్తున్న అధికారులు



పునరావాసానికి 421 మంది మత్స్యకారులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వరద ఉధృతి మళ్లీ పెరుగుతుండడంతో ఆదివారం ఉదయం గోదావరి లంకల్లోని మత్స్యకార కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించారు. నాలుగు రోజుల కిందటే వరద శాంతించడంతో వారిని లంకల్లోని వారి నివాసాల వద్దకు పంపారు. అయితే శనివారం రాత్రి మళ్లీ గోదావరి ఉధృతంగా మారి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో లంకల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆర్డీవో కృష్ణ నాయక్ ఆదేశించారు. ఈ మేరకు తహశీల్దారు పాపారావు రైల్వేస్టేషన్ సమీపంలోని మునిసిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఎదుర్లమ్మలంక, కేతావారి లంక, బ్రిడ్జిలంక, గౌతమిఘాట్ లంకకు ఆర్ఐ హరీశ్, వీఆర్వోలు సుందర ఉదయ భాను, అడబాల బాలాజీ, భుజంగరావు, వెదురు శివకుమార్, కొప్పుల మురళీ, భాస్కర్, ఏపీజే భవానీ, మల్లికార్జున, జరీనా, ఈశ్వరీబాయి మూడు పడవల్లో వెళ్లి మత్స్యకారులను తీసుకొచ్చారు. వరద ఇంకా తమ ఇళ్ల వద్దకు రాలేదని.. రాలేమని మత్స్యకారులు భీష్మించగా అధికారులు నచ్చజెప్పి 421 మందిని తీసుకొచ్చారు. వరద నెమ్మదించే వరకూ పునరావాసం కల్పిస్తామని అర్బన్ తహశీల్దార్ పాపారావు పేర్కొన్నారు.పునరావాస కేంద్రంలో ఏర్పాట్లు చేశామన్నారు.

వెళ్లిరావయ్యా.. గణేశా!

జై జై గణేశా.. జై కొడతాం గణేశా అంటూ భక్తజనం ఊగిపోయారు.. ఐదో రోజు ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు.. భారీ ర్యాలీగా విగ్రహాలను గోదావరి చెంతకు తీసుకొచ్చారు.. విగ్రహాలతో మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.. డ్యాన్సులు వేసుకుంటూ.. తీన్మార్ డప్పులతో గణనాథుడిని ఊరంతా తిప్పుతూ అంగరంగ వైభవంగా తీసుకొచ్చారు.. ఆదివారం జిల్లాలో ఎటు చూసినా వినాయకుడి ర్యాలీలు కనిపించాయి. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి గణనాథులను గోదావరి వద్దకు తీసుకొచ్చారు. దీంతో గోదావరి గట్లు భక్తులతో కిటకిటలాడింది.. రోడ్లు జనంతో కిక్కిరిశాయి.. పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. కొవ్వూరు గోష్పాదక్షేత్రం, నిడదవోలు చినకాశీరేవు, తీపర్రు గోదావరి రేవులు భక్తులతో నిండిపోయాయి.ఈ ఏడాది వీడుకోలిక గణేశా అంటూ విగ్రహాలను నిమజ్జనం చేశారు.



సెలవిక..

వెళుతున్నా..

కొవ్వూరులో నిమజ్జనం



ఇక వెళ్లొస్తాం..

వెళ్లిరావయ్యా..

నో టెన్షన్..అందరికీ పింఛన్..

అప్పీల్ చేయని 33 మందికే నిలుపుదల : కలెక్టర్

రాజమహేంద్రవరం,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : ఎవరికీ టెన్షన్ అవసరం లేదు..జిల్లాలో నోటీసులు పొందిన వారితో సహా అందరికీ సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ పంపిణీ చేస్తారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లాలో 2,35,813 మందికి రూ.102.8 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. దివ్యాంగుల పింఛన్లు 33,177 ఉన్నాయన్నారు. వాటిలో 40 శాతంలోపు వైకల్యం ఉన్నట్టు గుర్తించి రీ అసెస్‌మెంట్‌లో భాగంగా నోటీసులు పొందిన 3211 మందికి యధావిధిగా పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. తాత్కాలిక సర్టిఫికెట్లు ఉన్న మానసిక దివ్యాంగులు 640 మందికి ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకున్నట్టు వెల్లడించారు. 2571 మంది దివ్యాంగుల్లో 2538 మంది కమిషనర్లు, ఎంపీడీవోలకు అప్పీలు చేసుకున్నారన్నారు. వీరికి సోమవారం పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 33 మంది మాత్రమే అప్పీలు చేసుకోలేక పోయారని..వారిలో 21 మంది అప్పీలు చేసుకునే ఆసక్తి లేదని లిఖిత పూర్వకంగా తెలియజేశారన్నారు. ఈ 33 మందికి తప్ప మిగతా వారందరికీ పింఛన్లు వస్తాయన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అర్హులందరికీ పింఛన్లు అందజేస్తారన్నారు.



మాధవ్ పర్యటన వివరాలు వెల్లడిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన

రాజమండ్రిలో సారథ్యం యాత్ర..బహిరంగ సభ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలో సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పర్యటన విజయవంతం చేయాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ 19 జిల్లాల్లో పర్యటన పూర్తి చేసుకుని సోమవారం తూర్పుగోదావరి జిల్లాకు వస్తున్నారన్నారు. విశాఖపట్నంతో ఈ పర్యటన ముగుస్తుందన్నారు. సోమవారం ఉదయం నగరంలోని ఆర్ఎస్ఎస్ శాఖను సందర్శించి ప్రముఖులను కలుస్తారన్నారు.హ్యాపీస్ట్రీట్‌లో 7:30 గంటలకు ప్రజలతో చాయ్‌పే చర్చా కార్యక్రమంలో చిట్‌చాట్ ఉంటుందన్నారు. అనంతరం వై.జంక్షన్ నుంచి సారథ్యం యాత్ర ప్రారంభమై దేవీచౌక్ మీదుగా సుబ్రహ్మణ్య మైదానం చేరుకుంటుందన్నారు.అక్కడ బహిరంగ సభలో మాధవ్ మాట్లాడతారని తెలిపారు.బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి. నాగేంద్ర, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిదానంగా పెరుగుతున్న గోదావరి

» కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

» 11,35,249 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల


ధవళేశ్వరం రామపాదాల రేవు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ధవళేశ్వరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి నిదానంగా పెరుగుతూ ప్రవహిస్తోంది. శనివారం రాత్రి 9గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 11.75 అడుగులకు చేరుకుంది. ఆపై కొన్ని గంటల పాటు నిలకడగా ఉండి 2,3 గంటలకు ఒక పాయింట్ చొప్పున పెరుగుతూ ఆదివారం మధ్యాహ్నం 4గంటలకు 12.80 అడుగులకు చేరుకుంది. రాత్రి 7గంటలకు అదే రీడి ంగ్ వద్ద నిలకడగా కొనసాగింది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 11,35,249 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 4700 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2300 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5500 క్యూసెక్కులు చొప్పు న సాగునీటిని విడుదల చేస్తున్నారు.

ఎగువున భద్రాచలం వద్ద ఆదివారం ఉదయం 8గంటలకు నీటి మట్టం 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆపై ఒక పాయింట్ మాత్రమే పెరిగి 48.10 అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది. ఎగువున కాళేశ్వరం, పేరూరు వద్ద నీటి మట్టం తగ్గుతుండగా దిగువున దుమ్ముగూడెం, భద్రాచలం, కూనవరం, కుంట, పోలవరం వద్ద నిలకడగా ఉంది.

నిలకడగా శబరి

చింతూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శబరి, గోదావరి నదులు నిలకడగా ఉన్నాయి. ఆదివారం రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి 47.90 అడుగులు ఉండగా, చింతూరు వద్ద శబరి నది 32 అడుగుల మేర ప్రవహిస్తోంది. శబరి తగ్గకపోవడంతో దాదాపు పది రోజులుగా లోతట్టు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి అవస్థలు పడుతున్నారు. నిత్యావసర వస్తువులు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సకాలంలో వైద్యం అందక మహిళ మృతి


సుబ్బమ్మను ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబీకులు, ఆసుపత్రిలో మృతిచెందడంతో మృతదేహాన్ని నాటు పడవపై తరలిస్తున్న దృశ్యం



నాటు పడవపై మృతదేహం తరలింపు

చింతూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వరద కారణంగా రహదారులు మూసుకుపోయాయి. దీంతో లోతట్టువాసులు సకాలంలో ఆసుపత్రులకు చేరలేని పరిస్థితి విలీన మండలాల్లో ఉంది. దీంతో కొందరి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. వరరామచంద్రపురం మండలం కుంజవారిగూడెనికి చెందిన బొడ్డు సుబ్బమ్మ (65) రక్త హీనత కారణంగా బాగా నీరసించింది. శనివారం ఆమె కుటుంబీకులు సోకిలేరు వాగు మీదుగా నాటు పడవ దాటించి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందింది. దీంతో కుటుంబీకులు ఆసుపత్రి నుంచి సోకిలేరు వాగు వద్దకు ఆటోపై మృతదేహాన్ని తరలించి అక్కడి నుంచి నాటు పడవపై వాగు దాటించి మరో ఆటోపై కుంజవారిగూడెం తరలించారు.

ఇందుపల్లిలో వేద సభ


ఇందుపల్లిలో జరిగిన వేద సభలో పాల్గొన్న వేదపండితులు

అమలాపురం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సమస్త జీవకోటి సుభిక్షంగా జీవించేందుకు, మానవాళి జీవన విధానానికి వేదమే ప్రామాణికమని గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠి పేర్కొన్నారు. బ్రహ్మశ్రీ రాణి హయగ్రీవ అవధాని వేదశాస్త్ర పరిషత్ 14వ వార్షిక వేద సభ ఆదివారం కోనసీమ జిల్లా ఇందుపల్లి అరవ గరువులో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో శ్రీబాలభక్తగణపతి మందిరంలో నిర్వహించిన వేద సభకు తొలుత టీకే విశ్వనాథ్ వేదపండితులకు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన వేద సభలో దువ్వూరి సూర్యప్రకాశ సోమయాజులు మాట్లాడుతూ మానవులు సమస్త జీవకోటి కోసం ఆచరించాల్సిన ఆచారాలు, కర్మకాండల గురించి వేదాల్లో వివరించిన విధానాన్ని తెలియజేశారు. సమస్త విద్యల స్వరూపంగా వేదాలు భాషిస్తున్నాయని పేర్కొన్నారు. వడ్లమాని సుబ్రహ్మణ్య ఘనాపాఠి మాట్లాడుతూ ఎక్కడ వేదపఠనం జరుగుతుందో అక్కడ జీవరాశులు ఏవిధంగా సుభిక్షంగా ఉంటాయో వివరించారు. వేదికపై తంగిరాల సుబ్రహ్మణ్య సోమయాజులు పాల్గొని వేదాలు, ఉపనిషత్తుల సారాంశం తెలియచేశారు. తత్వ స్వరూపమై ఉన్న పరమాత్మన్ని తెలుసుకునేందుకు ఉపనిషత్తులు ఏవిధంగా దోహదపడతాయో విశదీకరిం చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు, ఘనాపాఠిలు, క్రమపాఠిలు వేదస్వస్తి నిర్వహించారు. కార్యక్రమంలో శిష్ఠా భవానీశంకర్, వేదశాస్త్ర పరిషత్ అధ్యక్షుడు కర్రా సోమసుందరశాస్త్రి, కార్యదర్శి ముష్టి వేంకటరాజేశ్వరశర్మ, కోశాధికారి అల్లవరపు సుబ్రహ్మణ్యదీక్షితులు, ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం వేదశాస్త్ర పరిషత్ తరఫున ఘనాపాఠీలు, పండితులను సత్కరించారు.

అడ్వకేట్ క్లర్క్స్ వెల్ఫేర్ సంఘ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బయ్య

కాకినాడ క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ అడ్వకేట్ క్లర్క్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం కాకినాడ బార్ అసోసియేషన్‌లో ఆదివారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చెక్కపల్లి చంటి, రాష్ట్ర నాయకులు ముప్పాళ్ళ సుబ్బారావు, నరహరిశెట్టి రవికృష్ణ హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు అంగులూరి సుబ్బయ్య మాట్లాడుతూ గుమస్తాల జీవన స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని, ప్రభుత్వం తీసుకొచ్చిన 13/92 ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ క్లర్క్స్ వెల్ఫేర్ ఫండ్‌ను అమలుచేయడంలో ఉన్న లోపాలను తక్షణం సరిదిద్దాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మరణానంతరం కుటుంబసభ్యులకు అందే ఆర్థిక సహా యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్ల భాస్కర్‌రావు మాట్లాడుతూ గుమస్తాల పిల్లల విద్య, కుటుంబ భద్రత కోసం ప్రత్యేక నిధి అవసరమన్నారు. గుమస్తాల సంక్షేమ నిధిని బలపర్చడం కోసం అందరు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాకినాడ బార్ అసోసియేషన్ నాయకులు గాదం సత్య ప్రభాకర్‌రావు, రాంబాబు, జీఎస్ఆర్ కృష్ణ, గోపి, సురేష్, సుధాకర్, నిరీక్షణరావు, నగేష్, సిరియల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అధ్యాపకుడు అసభ్యకర మెసేజ్‌లు

● దేహశుద్ధి చేసిన కుటుంబసభ్యులు ● ఆలస్యంగా వెలుగులోకి సంఘటన

అన్నవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకుడి వ్యవహార శైలి కారణంగా విద్యార్థిని కుటుంబసభ్యులు దేహశుద్ధి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యదేవ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకుడు డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థినిని నెలరోజులుగా వేధిస్తూ ఆమె ఫోన్‌కు అసభ్యకర మెసేజ్‌లు పంపడం, మానసికంగా వేధించడం, చెప్పినట్టు వినకపోతే పరీక్షల్లో తక్కువ మార్కులు వేస్తానని వేధించాడు. విద్యార్థిని కుటుంబసభ్యులకు చెప్పలేక మిన్నకుండిపోయింది. శనివారం కుటుంబసభ్యులు విద్యార్థిని ఫోన్‌లో మెసేజ్‌లు చూసి నిలదీయడంతో అసలు విషయం చెప్పింది. దీంతో కుటుంబసభ్యులు డిగ్రీ కళాశాలకు చేరుకుని అధ్యాపకుడికి దేహశుద్ధి చేయడంతో కళాశాల గోడ దూకి పరారయ్యాడు. ఈ విషయంపై పోలీసు కేసు పెడతామని కళాశాల ప్రిన్స్‌పాల్‌కు కుటుంబసభ్యులు తెలపడంతో అతడిపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు వెనుతిరిగారు.

గణపతి ఆలయం.. భక్తజన సంద్రం!

బిక్కవోలులో ప్రత్యేక పూజలు



బిక్కవోలులో శ్రీలక్ష్మీగణపతి దర్శనానికి బారులు తీరి స్వామివారి చెవిలో కోర్కెలు చెప్తున్న భక్తులు

బిక్కవోలు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఐదో రోజైన ఆదివారం తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులోని ప్రాచీన శ్రీలక్ష్మీగణపతి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు శ్రీలక్ష్మీగణపతికి మూల మంత్ర పూజలు, మంత్రజపతర్పణ, హావనములు, సావిత్రి పంటకోట ఉపపనిత్తు పారాయణాలు జరిపారు. హైకోర్టు ప్లీడర్లు స్వామి దర్శనానికి రావడంతో ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబా రెడ్డి వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయ అర్చకులతో ఆశీర్వచనాలు అందజేశారు. స్వామిని దర్శించుకున్నవారిలో హైకోర్టు జీపీ నాగరాజు నాగురు, పీపీలు మెండా లక్ష్మీనారాయణ, కైలార్ కృష్ణ, ఏపీ జెన్‌కో జీపీ భూషణచౌదరి, కమర్షియల్ టాక్స్ జీపీ బొబ్బా స్వామికిరణ్, ఇరిగేషన్ జీపీ శ్యామ్‌సుందరరావు వున్నారు. ఉచిత బస్సు పథకం కారణంగా మహిళలు బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలకు పోటెత్తారు.



అయినవిల్లిలో స్వామికి పంచ హారతులు, ఆలయం వద్ద భక్తులు

అయినవిల్లిలో ప్రత్యేక అలంకరణ

అయినవిల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తారు. స్వామికి అభిషేకాలు, లక్ష దూర్వార్చన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మూషిక వాహనంపై స్వామికి మాఢవీధి సేవ అనంతరం పంచ హారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు క్యూలైన్లలో వేచి ఉండడంతో దేవస్థానం బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసింది.

నేటి నుంచి అంతర్వేదిలో పవిత్రోత్సవాలు


శ్రీలక్ష్మీనరసింహస్వామివారు

అంతర్వేది, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన కోనసీమ జిల్లా అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో సోమవారం నుంచి గురువారం వరకు స్వామివారి పవిత్రోత్సవ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం నుంచి అంకురార్పణ, అధివాసములు మొదలగు పూజాకార్యక్రమాలతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మంగళ, బుధవారాల్లో అలంకార తిరుమంజనం, ప్రాయశ్చిత హోమాలు, పవిత్రాఅవరోహణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గురువారం అలంకార తిరుమ ంజనం, మహాశాంతి హోమం, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం, రాత్రి పవిత్ర అవరోహణ, విశేషార్చన, నీరాజన మంత్ర పుష్పములు, పవిత్రముల వినియోగం జరుగుతాయని తెలిపారు. ఆలయమంతా పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణతో తీర్చిదిద్ది మహాశాంతి హోమానికి తాత్కాలిక యాగశాల ఏర్పాటు చేశామన్నారు. దేశ, రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని, స్వామివారికి దివ్యతేజో ప్రకాశములు కలగాలని, సర్వప్రాయశ్చిత్తార్థం పవిత్రోత్సవాలు నిర్వహించబడతాయని ఆలయ ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ తెలిపారు.

7న మధ్యాహ్నం నుంచి దర్శనాలు నిలుపుదల

భాద్రపద పౌర్ణమి ఆదివారం రాత్రి 9.50 గంటలకు ప్రారంభమై రాత్రి 12.24 గంటలకు పూర్తి అయ్యే సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించు సందర్భంగా అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 7న ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి భక్తులకు దర్శనాలు నిలిపివేస్తారని ఏసీ ప్రసాద్ తెలిపారు. పునఃదర్శనాలు 8వ తేదీ సంప్రోక్షణ అనంతరం ఉదయం 8 గంటల నుంచి ఉంటాయని, ఆర్జిత అభిషేకం రద్దు చేయబడిందని పేర్కొన్నారు.

గిరిజన విద్యార్థిని మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

రంపచోడవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని దివ్యతేజ మృతదేహానికి ఆదివాసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. విద్యార్థిని మృతిపై ఇప్పటికే అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టంకు ముందు రక్త బంధువులు, పంచాయితీదార్ల సమక్షంలో శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. శనివారం ఆదివాసీ నాయకులు, బంధువులు ఆందోళనతో మృతురాలి కుటుంబానికి న్యాయం చేసేందుకు ఐటీడీఏ ముందుకురావడంతో ఆందోళన విరమించిన సంగతి తెలిసిందే. దీంతో ఆదివారం శవపంచ నామా, పోస్టుమార్టం కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకాలూ కలగలేదు. రంపచోడవరం డీఎస్పీ ప్రశాంతకుమార్ శనివారం ఆదివాసీ నాయకులు, బంధువులను సముదా యించి సమస్యను శాంతియుతంగా పరిష్కరిం పచేయడంలో కీలక పాత్ర పోషించి మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రయత్నించారు.

కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రానికి స్కోచ్ అవార్డు



కొవ్వూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ అరటి రకాలను ఉత్పత్తి చేయడంలో జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో కొవ్వూరు ఉద్యాన (అరటి) పరిశోధనా కేంద్రం స్కోచ్ అవార్డుకు ఎంపికైంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని వేములూరు రోడ్‌లో ఉన్న డా.వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధనా కేంద్రంలో సంప్రదాయ అరటి రకాల్లో నాణ్యమైన టిష్యూకల్చర్ మొక్కల ఉత్పత్తి చేయడంపై అవార్డుకు ఎంపికైనట్టు పరిశోధనా కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.డి.వెంకటస్వామి తెలిపా రు. ఇప్పటివరకు పరిశోధనా స్థానం నుంచి సుమారు 20 లక్షల టిష్యూకల్చర్ మొక్కలను ఉత్పత్తి చేయడం, మొట్టమొదటగా అరటిలో మగ పువ్వుల ద్వారా సంప్రదాయ అరటి రకాలైన తెల్ల చక్కెరకేళి, కర్పూర చక్కెరకేళి, అమృతపాణి, ఎర్ర చక్కెరకేళి, కర్పూరవల్లీ మొక్కలను అత్యధిక స్థాయిలో ఉత్పత్తి చేసి రైతుల అందించామన్నారు. ఈ అవార్డుకు సంబంధించి ఉద్యాన విభాగం సీనియర్ శాస్త్రవేత్త డా.కె.రవీంద్రకుమార్ 2025 ఏప్రిల్ నుంచి జూన్ వరకు వివిధ స్థాయిల్లో పాల్గొనడం జరిగిందన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీకి 4 అవార్డులు వచ్చాయని, వాటిలో కొవ్వూరు పరిశోధన కేంద్రానికి స్కోచ్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.

రాష్ట్ర సర్వే అకాడమీ రీజనల్ జేడీగా కుమార్


కుమార్

సామర్లకోట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్వే అకాడమీ రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా సీహెచ్‌వీఎస్ఎన్. కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ జిల్లా సామర్లకోటలో ఉన్న రాష్ట్ర సర్వే ట్రైనింగ్ అకాడమీ జేడీ, వైస్ ప్రిన్సిపాల్‌గా గత ఐదేళ్లుగా కుమార్ పనిచేస్తుండగా రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. తాజాగా పదోన్నతి పొందిన ఆర్‌జేడీ మల్టీజోన్ పరిధిలో శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకూ 13 జిల్లాలు సామర్లకోట పరిధిలోకి వస్తాయి. గతంలో కుమార్ అమరావతిలోని రాజధానిలో 33 వేల ఎకరాల భూమికి రికార్డుస్థాయిలో సర్వే నిర్వహించారు. అందుకుగాను అప్పటి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా చీఫ్ మినిస్టర్ స్టేట్ అవార్డు అందు కున్నారు. సర్వే ట్రైనింగ్ అకాడమీ ప్రిన్సిపాల్‌గా గత ఐదేళ్లుగా 25 వేలమందికి పైగా సర్వే, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ సిబ్బందికి రోవర్, సీవోఆర్ఎస్, క్యూజిస్, డ్రోన్‌సర్వే తదితర అంశాలపై 137 రకాల అధునాతన సర్వే శిక్షణ అందించారు. ఏపీ రీసర్వే ప్రాజెక్ట్‌లో 32 వేల చదరపు కిలో మీటర్లు హెలీకాప్టర్ ఫ్లై, డ్రోన్ ఫ్లై చేయించారు.

నర్సింగ్ పరీక్ష రద్దు

జీజీహెచ్(కాకినాడ) ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గత నెల 29న జరిగిన ఫౌండేషన్ ఆఫ్ నర్సింగ్ మొదటి సంవత్సర జీఎన్ఎం పరీక్షను రద్దు చేస్తున్నట్టు చీఫ్ సూపరిటెండెంట్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రద్దు చేసిన పరీక్షకు బదులుగా ఈ నెల 2న మంగళవారం అదే పరీక్షను కాకినాడ ఆర్ఎంసీలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు మంగళవారం యూనిఫామ్ అలాగే హాల్‌టికెట్‌తో సహ ఆర్ఎంసీకి ఉదయం 9 గంటలకు హాజరుకావాలని డాక్టర్ లావణ్యకుమారి స్పష్టం చేశారు.

సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో రాకపోకలు బంద్

అంతర్వేది, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో ఆదివారం పెరిగిన వరద కారణంగా రాకపోకలు బంద్ అయ్యాయి. పంట్లను పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం వైపు నిలిపివేశారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వశిష్ఠ గోదావరిలోకి 6లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో నర్సాపురం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. లంక ప్రాంతాలకు వరద నీరు చేరడంతో స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రధానంగా చించినాడ బ్రిడ్జి మరమ్మతుల నేపథ్యంలో రాకపోకలకు అంతరాయం లేకపోయినప్పటికీ సఖినేటిపల్లి రేవు మీదుగా నర్సాపురం చేరుకునేవారు అత్యధికంగా ప్రయాణికులు ఉంటారు. అయితే వరద ఉధృతి పెరగడంతో సఖినేటిపల్లి రేవులో రాకపోకలు రెండు రోజుల పాటు నిలిపివేశారు.

దేవాలయ భూముల్లో వ్యవసాయ పనులు

చెట్లను తొలగించిన రైతులపై కేసు

కొత్తపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం గోర్స గ్రామానికి చెందిన శ్రీసీతారామస్వామి దేవాలయ భూముల్లో వ్యవసాయ పనులు చేపట్ట రాదని కోర్టు స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ పనులు చేపట్టడమే కాకుండా గట్లపై ఉన్న చెట్లను అక్రమంగా తొలగించిన రైతులపై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కొమరగిరిలో సర్వే నెం.121, 122లో గోర్స దేవాలయానికి సుమారు 20 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని చాలాకాలంగా తామే సాగు చేస్తున్నామని ఆక్రమణదారులు, ఆ భూమి దేవుడిదేనని దేవాలయశాఖ మధ్య వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉంది. కొన్నిరోజులు మౌనంగా ఉన్న రైతులు ఆదివారం దేవాలయానికి చెందిన భూముల్లో వ్యసాయపనులు చేపట్టారు. అంతటితో ఆగకుండా గట్లపై ఉన్న చెట్లను నరికించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ రొంగల వీరబాబు తహశీల్దార్ జి.చిన్నారావుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో వీఆర్వో కిషోర్ చెట్లను నరికిన, వ్యవసాయ పనులు చేపట్టిన వారిపై కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విఘ్నేశుడికి వీడ్కోలు..





– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా విశేష పూజలందుకున్న గణపతి విగ్రహాలను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరిలో ఇలా నిమజ్జనం గావించారు.

299 పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు

మనమిత్ర యాప్ ద్వారా పన్నుల వసూళ్లు: కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న 299 పంచాయతీల పరిధిలో 3,58,297 ఎసెస్మెంట్లు నమోదయ్యాయని, వాటి ఆధారంగా ప్రజలు తమ ఇంటి, నీటి పన్నులను డిజిటల్ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో ప్రజలు సులభతరంగా పన్నులు చెల్లించేందుకు స్వర్ణ పంచాయతీ వెబ్ సైట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఇకపై నగదు చెల్లింపులు కన్నా డిజిటల్ చెల్లింపులకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టంచేశారు. నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డు, క్యూఆర్ కోడ్, డీడీ, చెక్కుల రూపంలో కూడా చెల్లింపులు చేయవచ్చన్నారు.దీని ద్వారా నేరుగా పంచాయతీ ట్రెజరీ ఖాతాలో జమవుతాయన్నారు. డిజిటల్ చెల్లింపుల వల్ల సమయం ఆదా అవ్వడంతో పాటు పారదర్శకత పెరుగుతుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు పంచాయతీ స్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మన మిత్ర యాప్ వినియోగించి పంచాయతీల ఆర్థిక పరిపుష్టిలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ప్రశాంతి కోరారు.

ప్రతిభావంతులను ప్రోత్సహిస్తాం: వాసు


మొదటి నగదు బహుమతిని అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేసే ప్రతిభ గల యువతను తామెప్పుడు ప్రోత్సహిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఇటీవల స్థానిక హోటల్ మంజీరాలో జరిగిన వరల్డ్ ఎంటర్ ప్రెన్యూర్ డే సందర్భంగా నిర్వహించిన రాజమండ్రి ఎంటర్ ప్రెన్యూర్ సమ్మిట్ 2025 ఐడియా పిచ్ కాంపిటీషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు టీమ్‌లకు ఆదివారం తన కార్యాలయంలో నగదు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.1.25 లక్షలు, రెండో బహుమతి రూ.లక్ష, మూడో బహుమతి రూ.75 వేలు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలతో ముందుకు వచ్చిన యువత భవిష్యత్‌లో మరిన్ని మంచి ఐడియాలతో ఆవిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, కొయ్యల రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక చికిత్స విధానాలపై అవగాహన సదస్సు

దివాన్‌చెరువు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆధునిక చికిత్సావిధానాలపై అవగాహన పెంపొందించుకునేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయని ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఈఎస్‌ఏపీ) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కేపీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. ఈఎస్‌ఏపీ రాష్ట్ర స్థాయి వార్షిక సమావేశం ఆదివారం దివాన్‌చెరువు సమీపంలోని కన్వెన్షన్ హాలులో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చిన్న, పెద్ద తేడా లేకుండా అందరిలో ఊబకాయం సమస్యగా మారిందని, దాని నివారణతోపాటు డయాబెటీస్, థైరాయిడ్, ఎముక ఆరోగ్యం గురించి చర్చించామన్నారు. డయాబెటీస్ వచ్చిన వారికి రెటీనా, కిడ్నీ సమస్యలు రాకుండా చేయడంపై కూడా మాట్లాడామన్నారు. అలాగే చికిత్స విధానంలో వస్తున్న ఆధునిక పద్ధతులపై చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ మిధున్‌చక్రవర్తి, జీఎస్ఎల్ వైద్యసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్లు ఎం.వీ శేఖర్‌రెడ్డి, ఎం.రాజేష్, టి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఊరేగింపులో ఘర్షణ

కత్తితో దాడి..ఇద్దరికి గాయాలు?

గోకవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయకుని నిమజ్జనం కోసం ఊరేగింపుగా వెళ్తున్న వ్యక్తులకు, బయట వ్యక్తు(ప్రయాణికులు)ల మధ్య జరిగిన వివాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్టు తెలిసింది. స్థానికుల సమాచారం మేరకు.. గంగవరం మండలం ఓజుబంద గ్రామానికి చెందిన పలువురు వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు గ్రామం నుంచి సమీపంలోని సీతపల్లి వాగు వద్దకు బయలుదేరారు. ఊరేగింపు గోకవరం మండల రామన్నపాలెం (గోకవరం-రంపచోడవరం ప్రధాన రహదారి) వద్దకు చేరుకునేసరికి రంపచోడవరం వైపు రెండు బైక్‌లపై వెళ్తున్న ఆరుగురు వ్యక్తులు ఊరేగింపును తప్పించుకొని వెళ్లే ప్రయత్నం చేశారు.ఆ సమయంలో ఊరేగింపుగా వెళ్తున్న వ్యక్తులకు, ఆ ఆరుగురు వ్యక్తుల మధ్య వివాదం తలెత్తింది. మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తులైన ఆరుగురు వ్యక్తులు అప్పటికే వారి వద్ద ఉన్న కత్తితో ఊరేగింపుదారులపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఓజుబందకు చెందిన కుంజం భరత్‌కుమార్, ఏక రాజేష్‌కుమార్ గాయపడ్డారు. బాధితులను గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు విశ్వసనీయ సమాచారం. కత్తులతో దాడి చేసిన వ్యక్తులు గోకవరంలోని డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటారని తెలిసింది. ఈ విషయంపై గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఎమ్మెల్యే నల్లమిల్లి


వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు.ఆదివారం రామవరంలోని ఎన్డీయే కార్యాలయంలో నియోజకవర్గ వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జ్వరాల కేసులు పెరుగుతున్నాయని గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు జ్వర పీడితుల వివరాలను సేకరించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందించే విధంగా కృషి చేయాలన్నారు.అనుమానితులను అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యమందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

కోరుకొండ సొసైటీకి 20 టన్నుల యూరియా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోరుకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం కోరుకొండలో రైతులు తోపులాట అనే ఆంధ్రజ్యోతి కథనానికి వ్యవసాయ శాఖాధికారులు స్పందించారు. 24 గంటల్లోనే 20 టన్నుల యూరియాను ఆదివారం సాయంత్రం కోరుకొండ సొసైటీకి పంపించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే సదరు సొసైటీ సీఈవో తమకు 40 టన్నుల యూరియా అవసరమని జిల్లా అధికారులకు ఇండెంట్ పెట్టారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ మండల వ్యవసాయాధికారి దగ్గరుండి 20 టన్నుల యూరియాను కోరుకొండ సొసైటీ గొడౌన్‌లో పెట్టించారు. మరో 20 టన్నులు సరఫరా చేస్తే కోరుకొండ పీఏసీఎస్ పరిధిలోని 10 గ్రామాల రైతులకు కనీసం రెండు బస్తాలు చొప్పున యూరియా అందించవచ్చని సీఈవో చెప్పారు.

భూపతిపాలెంలో ఉచిత వైద్య శిబిరం


గురుకుల పాఠశాలలో లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. విద్యార్థులందరికీ చర్మ, నేత్ర, దంత పరీక్షలు చేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన లైబ్రరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.లక్ష విలువైన పుస్తకాలను పూర్వ విద్యార్థులు అందజేశారు. ఈ వైద్యశిబిరం, లైబ్రరీ ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఎమ్మెల్యేను వారు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గళ్లా రాము, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కండరాల అసమతుల్యతతో భుజం నొప్పి!

వైద్య సదస్సులో ఫిజియోథెరపిస్ట్ భరత్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): భుజం నొప్పికి ఎముకలు, కీళ్ల సమస్యల నుంచి కండరాల అసమతుల్యత, కాలేయం పతనం కారణం కావచ్చని ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ భరత్ ఊటాల అన్నారు. డాక్టర్ ఆచార్యులు వదర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన వైద్య సదస్సులో మధుమేహంలో ఫిజియోథెరపీ ఇన్ ఫ్రోజెన్ షోల్డర్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. నొప్పిని తాత్కాలికంగా తగ్గించుకోవడం కాకుండా మూల కారణాన్ని గుర్తించి చికిత్స చేయడం ప్రధానమని సూచించారు. ఆధునిక చికిత్సా విధానంలో ఫిజియోథెరపీ సమర్థవంతమైనదని, భవిష్యత్తులోనూ ఇది కీలకం కానుందని అన్నారు. ఫ్రోజెన్ షోల్డర్ సమస్య ఎడెసివ్ క్యాప్సులైటిస్ వల్ల వస్తుందని, కండరాల ట్రిగ్గర్ పాయింట్లతోనూ ఇలాంటి ప్రభావాలను చూడవచ్చన్నారు. అయితే ప్రతి భుజం సమస్య ఫ్రోజెన్ షోల్డర్, రొటేటర్ కఫ్ టియర్‌గా ఉండనవసరం లేదని పేర్కొన్నారు. నగరంలోని పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు.

గణేశ్‌కు వీడ్కోలు


రాజమహేంద్రవరంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

- భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు
- గోదావరి రేవు వరకు అనుమతి
- ఉదయం నుంచి రాత్రి వరకు ప్రక్రియ
- నదిలో కలుపుతున్న నగరపాలక సంస్థ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ/రాజానగరం/అనపర్తి/ధవళేశ్వరం, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదు రోజులుగా భక్తుల పూజలందుకున్న గణనాథులకు ఆదివారం గ్రామోత్సవాలు, నిమజ్జనోత్సవాలను ఘనంగా జరిపించారు. గణపతి బప్పా మోరియా అంటూ బ్యాండ్ మేళాలు, బాణా సంచా కాల్పులతో గ్రామాల్లో ఊరేగించారు. ఈ నెల 7న సంపూర్ణ చంద్రగ్రహం ఏర్పడనుండడంతో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఈ ఏడాది తొమ్మిది రోజులు పాటు మాత్రమే నిర్వహించే అవకాశం ఉందని వేదపండితులు ముందు నుంచి చెప్పడంతో ఐదో రోజున విగ్రహాల నిమజ్జనోత్సవాలను కన్నుల పండువుగా నిర్వహించారు. దీనిలో భాగంగా భక్తులకు ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు విరివిగా జరిపించారు. రాజమహేంద్రవరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ పర్యవేక్షణలో స్థానిక గోదావరి బండ్ వద్ద ఉన్న పాత కుమారి ర్యాంప్ వద్ద ప్రత్యేకమైన క్రేన్‌ను ఏర్పాటు చేసి విగ్రహాలను కిందకు దించి అటుపై వాటిని పంటులోకి చేర్చి నిమజ్జనం చేస్తున్నారు. ఉదయం నుంచి అడపాదడపాగా నిమజ్జనం చేస్తున్నారు. ఊరేగింపులను పుష్కరాల రేవు వరకు అనుమతించి అటుపై కుమారి రేవులోకి విగ్రహాలతో ఉన్న వాహనాలను మాత్రమే వరుస క్రమంలో అనుమతిస్తున్నారు. రాత్రి 10గంటల సమయానికి పలు చోట్ల నుంచి వచ్చినచిన్నా పెద్ద విగ్రహాలు మొత్తం 180 వరకూ విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఇదిలా ఉండగా అనపర్తిలోని పాతవూరిలో శివాలయం వద్ద బాలలు నెలకొల్పిన బాల గణపతి విగ్రహాన్ని మినీ వ్యానులో ఊరేగించి బ్రాహ్మణ రేవులో నిమజ్జనం చేశారు. ధవళేశ్వరంలోని గొల్లపేట రామాలయ వీధిలో మహిళలు ఏర్పాటు చేసిన చవితి మండపాల్లో గణపయ్యను ఊరేగింపుగా తీసుకెళ్లి రామపాదాల రేవు వద్ద నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం మండపం వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకుడు సావాడ శ్రీనివాస రెడ్డి ఆర్థిక సహాయం చేశారు.




విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న కార్పొరేషన్ సిబ్బంది

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

దివాన్‌చెరువు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): శ్రీ గణపతి నవరాత్రుల్లో భాగంగా దివాన్‌చెరువులోని బీజాపురి టౌన్‌షిప్‌లోనూ, పాతతుంగపాడులోని శ్రీవినాయకుడి ఆలయం వద్ద ఆదివారం గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీజాపురి టౌన్‌షిప్‌లోని హోమం అనంతరం అన్నదానం జరిగింది. పాతతుంగపాడులో భక్తులు కొప్పిరెడ్డి వెంకట శివప్రసాద్, సత్యవతి దంపతులు హోమం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


బీజాపురి టౌన్‌షిప్‌లో గణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ఆరుద్ర శత జయంతి


కవి ఆరుద్ర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సోము

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సమగ్రాంధ్ర సాహిత్య నిర్మాతగా, అభ్యుదయ సాహిత్యం, సినీ సాహిత్యంలో చెరగని ముద్ర వేసుకున్న మహాకవి ఆరుద్ర, సాహిత్యపరంగా జాతి సంపదలో ఓ భాగమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ మందిరంలో జరిగిన మహాకవి ఆరుద్ర శతజయంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఆరుద్ర చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఆరుద్ర సామాన్యుల గుండెల్లో సినీ కవిగా చెరగని ముద్ర వేశారని, నిప్పు కణికల వంటి భావాలు ఎన్ని ఉన్నప్పటికీ ఆరుద్ర హృదయంలో భారతీయత పూర్తిగా నిండి ఉందని అన్నారు. కార్యక్రమంలో నన్నయ యూనివర్శిటీ తెలుగు శాఖాచార్యుడు తలారి వాసు, న్యాయవాది కేవిఎల్ భవాని, చిత్రకారిణి ఎన్‌వీఎస్ఎస్ లక్ష్మి, గాడేపల్లి భార్గవి, మల్లాది శ్రీరామ్ పాల్గొన్నారు. ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో సంవత్సర కాలం పాటు పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సరస్వతీ ఘాట్‌లో దేశిరెడ్డి బలరామనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ వేదంలా ఘోషించే గోదావరి అనే వైభవ గీతాన్ని ఆరుద్ర రాజమండ్రి ప్రజలకు అందించారన్నారు. ఆరుద్ర సాహిత్యాన్ని రాబోయే తరానికి అందేలా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తోట సుబ్బారావు, వీపీటీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

కడియం: ప్రజాకవి భాగవతుల సదాశివ శంకరశాస్త్రి (ఆరుద్ర) శతజయంతి ఉత్సవాలు కడియంలో ఘనంగా నిర్వహించారు. కళాసమితి అధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం, న్యాయవాది తోరాటి వసంతరావు.. ఆరుద్ర చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో చిలుకూరి శ్రీనివాసరావు, కోనసీమ జిల్లా అరసం అధ్యక్షుడు గండి స్వామిప్రసాద్, యూటీఎఫ్ నాయకులు ఉంగరాల వీరభద్రరావు, చెళ్లపిళ్ల కమిటీ సభ్యులు బొర్రా రామకృష్ణ, రాజేష్, కడించర్ల కోటి, రేలంగి శ్రీనువాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ

దివాన్‌చెరువు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువుకు మంజూరైన ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా సంబంధిత సిబ్బంది ఆదివారం మట్టి నమూనాలు సేకరించారు. రాజానగరం మండలం దివాన్‌చెరువు పరిధిలోని పాతూరు రామాలయం సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని దాదాపు 30 మీటర్లు లోతున తవ్వి మట్టి నమూనాలను సేకరించి తీసుకెళ్లారు. ఫ్లైఓవర్ కోసం ఎంత లోతున తవ్వాలన్న విషయమై ఈ మట్టి నమూనాల నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని తెలిసింది.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

కడియం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మురమండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలు, చైల్డ్ అట్రాసిటీ చట్టాలపై అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ బీకేఆర్ చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం 7వ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి బాల్య వివాహాలు-చట్టాలను వివరించారు. ఎస్ఐ దుర్గాప్రసాద్ బాల్య వివాహాలు చేసుకుంటే కలిగే దుష్పరిణామాలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకుడు మారెళ్ల విజయకుమార్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

8 నుంచి ఉపాధ్యాయుల రణభేరి యాత్ర

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8నుంచి రణభేరి యాత్ర పేరుతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.జయకర్, ఏ.షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా ఆఫీస్‌బేరర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏలు, డీఏ ఏరియర్లు, ఎర్న్ లీవుల నగదు, గత పీఆర్‌సీ ఏరియర్లు, కొత్త పీఆర్‌సీ ఏర్పాటు, ఐఆర్ తదితర ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు నుంచి అక్టోబరు వరకూ మూడు దశల్లో ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చిరంజీవి యువత ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రాజమహేంద్రవరంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఆదివారం చిరంజీవి యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు విచ్చేశారు. శిబిరంలో డాక్టర్ అయ్యల జయభారతి సహకారంతో సుమారు 200 మందికి దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వానపల్లి అంజనేయులు, దొడ్డి జానీ, వర్రే రాజేష్ నాయుడు, సికోటి శివాజీ, సుంకర శ్రీనివాస్, సుంకర ప్రసాద్, నంగినేటి నాగేశ్వరరావు, కర్రి అభి, కర్రి రవికుమార్, సిహెచ్ సుందర్, రవితేజ పాల్గొన్నారు.

ఆళ్ల గోవిందుకు మాతృవియోగం



గోవిందును ఓదార్చుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి, మనోజ్‌రెడ్డి.. ఇన్‌సెట్లో ఆళ్ల వీర్రాఘవులు(ఫైల్)

రంగంపేట ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు మాతృమూర్తి ఆళ్ల వీర్రాఘవులు ఆదివారం మండలంలోని వడిశలేరులో అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి వడిశలేరు చేరుకుని వీర్రాఘవులు పార్థీవ దేహానికి నివాళులర్పించి గోవిందును ఓదార్చారు. నియోజకవర్గంలోని పలువురు కూటమి నాయకులు గోవిందును పరామర్శించి సానుభూతిని ప్రకటించారు.

ఉధృతంగా గోదావరి

- అప్రమత్తమైన అధికారులు
- తొర్రేడు జడ్పీ హైస్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు


మరబోటుపై ములకల్లంక వెళ్తున్న తహశీల్దార్ శ్రీనివాస్

సీతానగరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని లంక గ్రామమైన ములకల్లంక గోదావరి మధ్యలో ఉన్నందున వరద మరింత పెరిగితే వచ్చే ఇబ్బందుల దృష్ట్యా తహశీల్దార్ ఆదివారం ములకల్లంక చేరుకుని అక్కడి ప్రజలతో మాట్లాడారు. వరద ఉధృతమైతే రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు జడ్పీ హైస్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని, అందరూ అక్కడికి చేరుకోవాలని పేర్కొన్నారు. ములకల్లంకలో పారిశుధ్య కార్యక్రమాలు ప్రతిరోజూ జరగాలని, బ్లీచింగ్ జల్లాలని సూచించారు. పంచాయతీ నీళ్లలో క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. బొబ్బిల్లంక ములకల్లంక గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటుచేయాలని వైద్య ఆరోగ్య శాఖను కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ములకల్లంక వాసులను అక్కడ నుంచి తీసుకురావడానికి ప్రయత్నించినా వారు అంగీకరించడం లేదని, వరద మరింత పెరిగితే లంక వాసులను అక్కడి నుంచి తరలిస్తామన్నారు. వరద సమాచారానికి తగినట్టుగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎల్ఐసీ డీవో ఆచారి పదవీ విరమణ సభ


ఆచారిని సత్కరిస్తున్న ఏజెంట్లు, విస్తరణాధికారులు, ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ రాజమహేంద్రవరం రూరల్ బ్రాంచిలో 33 ఏళ్ల పాటు డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసిన వంగల రామగోపాలకృష్ణమాచారి పదవీ విరమణ సత్కార సభ ఆదివారం రాజమహేంద్రవరం శుభమస్తు ఫంక్షన్ హాలులో జరిగింది. ఏజెంట్లు, ఉద్యోగులు కలిసి వీఆర్‌జీకే ఆచారి-సీతాలక్ష్మిలను భారీ గజమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆచారి సేవలను పలువురు కొనియాడారు. ఎల్ఐసీ రూరల్ కార్యాలయ డీవోల సంఘం అధ్యక్షుడు వై.కాశీవరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యుఐ జోనల్ ప్రెసిడెంట్ పీఎస్ఎన్‌వీఎన్ ప్రసాద్, బ్రాంచి మేనేజర్ రఘు, ఏబీఎం అబ్రహం, పీఎస్ఎన్‌వీ ప్రసాద్, కె.శ్రీనివాస్, కిషోర్‌కుమార్, శ్రీకాంత్, ఆదిమూలం సాయిబాబా, వై.రామ్మోహన్ పాల్గొన్నారు.



గోదావరి వరద తగ్గుముఖం పట్టలేదు.. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది..

తగ్గని గోదారి

6





లంకల నుంచి మత్స్యకారులను తరలిస్తున్న అధికారులు

పునరావాసానికి 421 మంది మత్స్యకారులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వరద ఉధృతి మళ్లీ పెరుగుతుండడంతో ఆదివారం ఉదయం గోదావరి లంకల్లోని మత్స్యకార కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించారు. నాలుగు రోజుల కిందటే వరద శాంతించడంతో వారిని లంకల్లోని వారి నివాసాల వద్దకు పంపారు. అయితే శనివారం రాత్రి మళ్లీ గోదావరి ఉధృతంగా మారి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో లంకల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆర్డీవో కృష్ణ నాయక్ ఆదేశించారు. ఈ మేరకు తహశీల్దారు పాపారావు రైల్వేస్టేషన్ సమీపంలోని మునిసిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఎదుర్లమ్మలంక, కేతావారి లంక, బ్రిడ్జిలంక, గౌతమిఘాట్ లంకకు ఆర్‌ఐ హరీశ్, వీఆర్వోలు సుందర ఉదయ భాను, అడబాల బాలాజీ, భుజంగరావు, వెదురు శివకుమార్, కొప్పుల మురళీ, భాస్కర్, ఏపీజే భవానీ, మల్లికార్జున, జరీనా, ఈశ్వరీభాయి మూడు పడవల్లో వెళ్లి మత్స్యకారులను తీసుకొచ్చారు. వరద ఇంకా తమ ఇళ్ల వద్దకు రాలేదని.. రాలేమని మత్స్యకారులు భీష్మించగా అధికారులు నచ్చజెప్పి 421 మందిని తీసుకొచ్చారు. వరద నెమ్మదించే వరకూ పునరావాసం కల్పిస్తామని అర్బన్ తహశీల్దార్ పాపారావు పేర్కొన్నారు.పునరావాస కేంద్రంలో ఏర్పాట్లు చేశామన్నారు.

వెళ్లిరావయ్యా.. గణేశా!

జై జై గణేశా.. జై కొడతాం గణేశా అంటూ భక్తజనం ఊగిపోయారు.. ఐదో రోజు ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు.. భారీ ర్యాలీగా విగ్రహాలను గోదావరి చెంతకు తీసుకొచ్చారు.. విగ్రహాలతో మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.. డ్యాన్స్‌లు వేసుకుంటూ.. తీన్మార్ డప్పులతో గణనాథుడిని ఊరంతా తిప్పుతూ అంగరంగ వైభవంగా తీసుకొచ్చారు.. ఆదివారం జిల్లాలో ఎటు చూసినా వినాయకుడి ర్యాలీలు కనిపించాయి. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి గణనాథులను గోదావరి వద్దకు తీసుకొచ్చారు. దీంతో గోదావరి గట్లు భక్తులతో కిటకిటలాడింది.. రోడ్లు జనంతో కిక్కిరిశాయి.. పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. కొవ్వూరు గోష్పాదక్షేత్రం, నిడదవోలు చినకాశీరేవు, తీపర్రు గోదావరి రేవులు భక్తులతో నిండిపోయాయి.ఈ ఏడాది వీడుకోలిక గణేశా అంటూ విగ్రహాలను నిమజ్జనం చేశారు.



ఇక వెళ్లొస్తాం..



వెళ్లిరావయ్యా..

సెలవిక..

వెళుతున్నా..

కొవ్వూరులో నిమజ్జనం

నో టెన్షన్..అందరికీ పింఛన్..

అప్పీల్ చేయని 33 మందికే నిలుపుదల : కలెక్టర్

రాజమహేంద్రవరం,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : ఎవరికీ టెన్షన్ అవసరం లేదు..జిల్లాలో నోటీసులు పొందిన వారితో సహా అందరికీ సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ పంపిణీ చేస్తారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లాలో 2,35,813 మందికి రూ.102.8 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. దివ్యాంగుల పింఛన్లు 33,177 ఉన్నాయన్నారు. వాటిలో 40 శాతంలోపు వైకల్యం ఉన్నట్టు గుర్తించి రీ అసెస్‌మెంట్‌లో భాగంగా నోటీసులు పొందిన 3211 మందికి యధావిధిగా పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. తాత్కాలిక సర్టిఫికెట్లు ఉన్న మానసిక దివ్యాంగులు 640 మందికి ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకున్నట్టు వెల్లడించారు. 2571 మంది దివ్యాంగుల్లో 2538 మంది కమిషనర్లు, ఎంపీడీవోలకు అప్పీలు చేసుకున్నారన్నారు. వీరికి సోమవారం పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 33 మంది మాత్రమే అప్పీలు చేసుకోలేక పోయారని..వారిలో 21 మంది అప్పీలు చేసుకునే ఆసక్తి లేదని లిఖిత పూర్వకంగా తెలియజేశారన్నారు. ఈ 33 మందికి తప్ప మిగతా వారందరికీ పింఛన్లు వస్తాయన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అర్హులందరికీ పింఛన్లు అందజేస్తారన్నారు.



మాధవ్ పర్యటన వివరాలు వెల్లడిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన

రాజమండ్రిలో సారథ్యం యాత్ర..బహిరంగ సభ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలో సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీవీఎన్ మాధవ్ పర్యటన విజయవంతం చేయాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ 19 జిల్లాల్లో పర్యటన పూర్తి చేసుకుని సోమవారం తూర్పుగోదావరి జిల్లాకు వస్తున్నారన్నారు. విశాఖపట్నంతో ఈ పర్యటన ముగుస్తుందన్నారు. సోమవారం ఉదయం నగరంలోని ఆర్‌ఎస్‌ఎస్ శాఖను సందర్శించి ప్రముఖులను కలుస్తారన్నారు.హ్యాపీస్ట్రీట్‌లో 7:30 గంటలకు ప్రజలతో చాయ్‌పే చర్చా కార్యక్రమంలో చిట్‌చాట్ ఉంటుందన్నారు. అనంతరం వై.జంక్షన్ నుంచి సారథ్యం యాత్ర ప్రారంభమై దేవీచౌక్ మీదుగా సుబ్రహ్మణ్య మైదానం చేరుకుంటుందన్నారు.అక్కడ బహిరంగ సభలో మాధవ్ మాట్లాడతారని తెలిపారు.బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి. నాగేంద్ర, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిడదవోలు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోట సత్తెమ్మ వారి దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభించి, ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర , మహానివేదన చేశారు. తర్వాత ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు ఉచిత, ప్రత్యేక దర్శనాల ద్వారా దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఎటువంటి అసౌకర్యం ఆలయ కమిటీ చర్యలు చేపట్టింది.

ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే



పంగిడిలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆదివారం మండలానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీచేశారు. కాపవరం, ఐ.పంగిడి, ధర్మవరం గ్రామాలకు చెందిన 10 మందికి రూ. 5,22,698 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో కాపవరానికి చెందిన గూడాల ఐశ్వర్యకు రూ.22,060, ముత్యాల అరుణకు రూ.25,655, ఉన్నమట్ల భానుకు రూ. 15,000, ఐ.పంగిడికి చెందిన బొల్లా సూరిబాబుకు రూ.37,205, అల్లాడి సుబ్బారావుకు రూ.59,500, అడపా వెంకట సాయిపవన్‌కు రూ. 35,000, తోట విజయవర్ధన్‌కు రూ.30,000, మామిళ్లపల్లి సుబ్బారావుకు రూ. 1,12,190, చలపాతి మీరమ్మకు రూ. 30,786, ధర్మవరానికి చెందిన కలగర సావిత్రికి రూ. 1,55,302, నరుకూరి యశస్వి మౌనికకు రూ. 22,074 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్న, సూర్యదేవర రంజిత్, టీడీపీ, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు .. ఎన్‌ఆర్ సుబ్రహ్మణ్యం



సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరిస్తున్న అధ్యాపక బృందం

నల్లజర్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా గణిత టీచర్‌గా, ఎంఈవోగా, డైట్ లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా అనేక హోదాలో పనిచేసిన ఎన్‌ఆర్ సుబ్రహ్మణ్యం ఆదర్శనీయుడని పలువురు కొనియాడారు. దూబచర్ల డైట్ కళాశాలలో ఆదివారం సుబ్రహ్మణ్యం పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కమల కుమారి ఆధ్వర్యంలో జరిగింది. విశ్రాంత ప్రిన్సిపాళ్లు డీ. బూరయ్య, చంద్రకళ, జయ సూర్యప్రకాశరావు, శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

బాడీ ఫ్రీజర్ అందజేత



మానవత సంస్థకు అందిస్తున్న దృశ్యం

తాళ్లపూడి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ సింహాద్రి జనార్దనరావు ఆదివారం సంస్థకు బాడీ ఫ్రీజర్‌ను అందించారని సంస్థ అధ్యక్షుడు వెటుగుబంటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఫ్రీజర్ అన్నదేవరపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉంచడానికి అనుమతిచ్చిన అధికారులకు ధన్యావాదాలు తెలిపారు. ఎవరికైనా అవసరమైతే వినియోగించుకుని, తిరిగి బాధ్యతగా అప్పగించాలని తెలిపారు. అప్పన హనుమంతరావు, గెడ్డం సాయిబాబా, వి. చంద్రయ్య, సురేష్, టీ. దోసాలు, పలువురు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బైబై..గణేశా

● వాడవాడలా ఘనంగా వినాయక నిమజ్జనాలు



విగ్రహాన్ని గోదావరిలో నిమజ్జనం చేసేందుకు తెస్తున్న భక్తులు

కొవ్వూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలోని పలుచోట్ల ఆదివారం వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానాలు చేశారు. అనంతరం మండపాలలో కొలువుదీరి గత ఐదు రోజులుగా నిత్య పూజలందుకున్న గణనాథులను ట్రాక్టర్లు, ఆటోలు, తోపుడుబండ్లు, కార్లపై మేళతాళాలు, యువత కేరింతలు, నృత్యాలు చేస్తూ పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా గోష్పాదక్షేత్రానికి తరలిస్తూ... పోలీసుల భద్రత మధ్య గోదావరిలో నిమజ్జనం చేశారు. ఆదివారం ఒక్క రోజే సుమారు 38 వినాయక నిమజ్జనాలు ఇక్కడ జరిగాయి. అలాగే నియోజకవర్గంలోని కొవ్వూరు పట్టణం, మండలం, తాళ్లపూడి, చాగల్లు మండలాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, లారీలపై విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. పట్టణ సీఐ పీ.విశ్వం, ఎస్ఐ విజయ్‌కుమార్ బందోబస్తును ఏర్పాటు చేశారు. విగ్రహాలను క్రేన్ సహాయంతో గోదావరిలో నిమజ్జనం చేశారు. నదికి వరద పోటెత్తి ఉధృతంగా ప్రవహిస్తున్నందున్న భక్తులను స్నానఘట్టాల వద్దకు రాకుండా నిలిపివేశారు.

నిడదవోలు: నిడదవోలు పట్టణం, మండలం నుంచి ఆదివారం వినాయక విగ్రహాలు నిమజ్జనాలకు తరలివెళ్లాయి. పట్టణంలోని శాంతి నగర్‌లో లంబోదర యూత్ కమిటీ లడ్డూ వేలం పాట నిర్వహించగా రూ. తొమ్మిది వేలకు వాసా సత్యప్రశాంత్ పాడుకున్నారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దేవరపల్లి: పోలవరం కాల్వ, దేవరపల్లి ఊర చెరువులో ఆదివారం వినాయకుని నిమజ్జనాలు జరిగాయి.కొండపల్లి సత్యనారాయణ, కోమటిపల్లి కృష్ణారావు, గన్నమని రామకృష్ణ, బొంతా సత్యనారాయణ, వెంకటకృష్ణ, కేశ్రీహరి చౌదరి, మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: వినాయకుడు ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది.బ్రాహ్మణగూడెం నడివీధిలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారిని ఊరేగించారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనాలను ఘనంగా నిర్వహించారు. తాడిపర్రులో కరికాలభక్త సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. అలాగే గ్రామానికి చెందిన కొండేటి సురేష్ అనే భక్తుడు ఒంటికి శూలాలు ధరించి వినాయకుని విగ్రహరథం ఊరేగింపునకు ముందు నడిచాడు. పాలంగి, ఉండ్రాజవరంలోనూ ఊరేగింపు నిర్వహించారు.

ముస్లిం పిల్లల సందడి

పెరవలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సంబరాల్లో పెద్దల నుంచి పిల్లలు వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొంటుంటారు. ప్రతి గ్రామంలో ఈ ఏడాది కూడా పిల్లలు కూడా మండపాలు నెలకొల్పి నిత్యం పూజలు చేస్తూ ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. కాగా, తీపర్రులోని ముస్లిం కాలనీలో కూడా పిల్లలు వినాయకున్ని నెలకొల్పి ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. స్వయంగా డప్పులు వాయిస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించడం విశేషం



నిడదవోలు శాంతినగర్‌లో ...



దేవరపల్లిలో ..

ఇళ్లపల్లిలో ... ఉచిత కంటి వైద్య శిబిరం

బిక్కవోలు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇళ్లపల్లిలో ఆదివారం కాకినాడకు చెందిన అంజు ఐకేర్ వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 85 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, 15 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కాగా, ఏడుగురికి ఆపరేషన్లు అవసరమౌతాయని గుర్తించి, వారిని కాకినాడ తీసుకువెళ్లారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీనివాస్ నూతన నియామకం



విశాఖ సీపీ నుంచి నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

నిడదవోలు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కే.శ్రీనివాస్‌ను ఉభయ గోదావరి జిల్లాల హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ మేరకు ఆదివారం విశాఖలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

జ్ఞాన సరస్వతి పూజలు



చాగల్లులో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణేష్ మహోత్సవాల్లో భాగంగా సంపత్ వర సిద్ధి వినాయకుడి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జ్ఞానసరస్వతి పూజలు నిర్వహించారు. చాగల్లు, నెలటూరు వర్తక సంఘం వారి ఆధ్వర్యంలో జరిగింది. గ్రామంలోని విద్యార్థులు అధిక సంఖ్యలో పాలొన్నారు. అనంతరం సుమారు 500 మంది చిన్నారులతో హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. పెరవలి మాతృభాషా పరిరక్షణ సమితి, తూర్పుగోదావరి జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వేదపండితులు లింగాల శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గ్రంధి రాంబాబు, సభ్యులు జాన్ గంగారావు పాల్గొన్నారు.

ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన బలుసు



లోకేశ్‌ను కలిసిన బలుసు సత్యనారాయణ

దేవరపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన ఆల్‌ఇండియా విష్ణుసహస్రనామ కల్చర్ ఫెడరేషన్ సభ్యుడు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యుడు బలుసు సత్యనారాయణ విశాఖపట్నంలోని ఎన్‌టీఆర్ భవన్‌లో విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌ని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు, దసరా శరన్నవ రాత్రులు నిర్వహించేందుకుగాను మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకు లోకేశ్‌కి ధన్యవాదాలు తెలిపినట్టు బలుసు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భక్తులు ఏర్పాటు చేసే మండపాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. గత 20 సంవత్సరాల నుంచి బలుసు సత్యనారాయణ విజయలక్ష్మి దంపతులు చేస్తున్న ఆధ్యాత్మిక, మానవత స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను లోకేశ్‌కు తెలిపినట్టు తెలియజేశారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. ఈయనతోపాటు తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ సమావేశం



గాట్ సభ్యుడు చిన్నబాబును సత్కరిస్తున్న సభ్యులు

కొవ్వూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల నిర్వహణలో కొవ్వూరు జోన్ జిల్లాలో మొదటి స్థానంలో ఉండాలని లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ యనమదల సుబ్రహ్మణ్యం అన్నారు. కొవ్వూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం జిల్లా గవర్నర్ మొదటి జోన్ అడ్వయిజరీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ పూర్వపు అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ, గాట్ సభ్యుడు పీఎంజేఎఫ్ పాలింపాటి చిన్నబాబు చౌదరిను శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కొవ్వూరు, దేవరపల్లి, తాళ్లపూడి లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు



దేవరపల్లి సొసైటీ గొడౌన్‌లో ఎరువుల రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

దేవరపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వ్యవసాయశాధికారులతో కలిసి ఆదివారం ఎరువుల షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా సొసైటీలో ఉన్న గొడౌన్ రికార్డును విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోపీకృష్ణ, తహశీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పరిశీలించారు. వీరితో పాటు దేవరపల్లి వ్యవసాయాధికారి కమలరాజు, గోపాలపురం ఏవో ఏసుబాబు ఉన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి

అనపర్తి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యాధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం రామవరంలోని ఎన్డీయే కార్యాలయంలో నియోజకవర్గ వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జ్వరాల కేసులు పెరుగుతున్నాయని గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు జ్వర పీడితుల వివరాలను సేకరించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించే విధంగా వైద్యాధికారులు కృషి చేయాలన్నారు.

అసత్యాలు ప్రచురిస్తే సహించం : కొర్లపాటి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గోపాలపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మీడియా ముసుగులో ప్రభుత్వంపై బురద జల్లేందుకు అసత్యాలు ప్రచురిస్తే సహించేది లేదని టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి శ్రీరామచంద్రరావు (రాము) కొన్ని మీడియాలను ఘాటుగా హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో స్మార్ట్‌కార్డుల పంపిణీలో అవాస్తవాలు ప్రచురించిన దినపత్రికలు, ఛానల్స్ తీరును ఖండిస్తూ ఆదివారం పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీరామచంద్రరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పడిన ఏడాదిన్నరలోపే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలైన ఉచిత సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత స్త్రీశక్తి పథకాలను అమలు చేస్తుంటే ... అవి చూసి ఓర్వలేని ఒక పత్రికతో పాటు కొన్ని చానళ్ల అబద్ధపు వార్తలు ప్రచురించడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు భూరెడ్డి వాసు, సొసైటీ చైర్మన్‌లు గద్దే హరిబాబు, వడ్లమూడి రమేశ్, ఏఎంసీ డైరెక్టర్ కూనపం ప్రసాద్‌బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీనివాసరావు, గ్రామ కమిటీ మాజీ అధ్యక్షులు మద్దిపాటి రమేశ్, జ్యేష్ఠ శ్రీధర్, టీడీపీ నాయకులు జ్యేష్ఠ శ్రీనివాసరావు, దుగ్గిరాల శ్రీను, సురేశ్, రాము, కొడవటి గంగరాజు, పటాన్ బాష, తదితరులు పాల్గొన్నారు.

స్కోచ్ అవార్డుకు ఎంపిక



కొవ్వూరు ఉద్యాన వన పరిశోధనా కేంద్రం

కొవ్వూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ అరటి రకాలను ఉత్పత్తి చేయడంలో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో కొవ్వూరు ఉద్యాన (అరటి) పరిశోధనా కేంద్రం స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యింది. కొవ్వూరు పట్టణంలోని వేములూరు రోడ్‌లో ఉన్న డా.వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధనా కేంద్రంలో సంప్రదాయ అరటి రకాలలో నాణ్యమైన టిష్యూకల్చర్ మొక్కల ఉత్పత్తి చేయడంతో అవార్డుకు ఎంపికయినట్టు పరిశోధనా కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ డి.వెంకటస్వామి తెలిపారు. ఇప్పటివరకు పరిశోధనా స్థానం నుంచి సుమారు 20 లక్షల టిష్యూ కల్చర్ మొక్కలను ఉత్పత్తి చేయడం, మొట్టమొదటగా అరటిలో మగ పువ్వుల ద్వారా సంప్రదాయ అరటి రకాలైన తెల్ల చక్కెర కేళి, కర్పూర చక్కెర కేళి, అమృతపాణి, ఎర్ర చక్కెరకేళి, కర్పూరవల్లీ మొక్కలను అత్యధిక స్థాయిలో ఉత్పత్తి చేసి రైతులకు అందించడం జరిగిందన్నారు. ఈ అవార్డుకు సంబంధించి ఉద్యాన విభాగం సీనియర్ శాస్త్రవేత్త డా.కె.రవీంద్రకుమార్ 2025 ఏప్రిల్ నుంచి జూన్ వరకు వివిధ స్థాయిలలో పాల్గొనడం జరిగిందన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీకి నాలుగు అవార్డులు వచ్చాయని, వాటిలో కొవ్వూరు పరిశోధన కేంద్రానికి స్కోచ్ అవార్డు రావడం పట్ల ఆనందంగా ఉందని పరిశోధనా కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ డి.వెంకటస్వామి తెలిపారు.

డీఎస్సీ ఫలితాల్లో శ్రీహరికి 250వ ర్యాంకు

తాళ్లపూడి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో తాళ్లపూడి యానాది కాలనీకి చెందిన చెరుకూరి శ్రీహరి జిల్లాలో 250వ ర్యాంకు సాధించాడు. ఎస్టీ కేటగిరీలో అయితే జిల్లా మొదటి ర్యాంకుగా నిలిచాడు. ఇతని తల్లితండ్రులిద్దరూ రోజుకూలీ చేసుకుని కుటుంబాన్ని గడుపుతున్నారు. ఇతను చిన్ననాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువు కొనసాగించాడు. తర్వాత పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో టీచర్‌గా పనిచేశాడు. దీంతో పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతా : రాఘవులు



కాల్దరిలో పౌల్ట్రీ ఫారాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఉండ్రాజవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని సీపీఎం నేత బీవీ రాఘవులు పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయం, ఆక్వా, పౌల్ట్రీ పరిశ్రమల్లో వస్తున్న ఇబ్బందుల పరిశీలనలో భాగంగా ఆదివారం కాల్దరిలో ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ చైర్మన్ కోమట్లపల్లి వెంకటసుబ్బారావు పౌల్ట్రీ ఫారాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ చైర్మన్ కోమట్లపల్లి వెంకటసుబ్బారావు పౌల్ట్రీ పరిశ్రమలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను, ఒడిదొడుకులను రాఘవులకు వివరించారు. దీనిపై రాఘవులు మాట్లాడుతూ వివిధ రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని వివరించారు. అనంతరం వేలివెన్నులోని సీపీఎం పూర్వ సానుభూతిపరులు బూరుగుపల్లి రత్తయ్య దంపతులను కలసి యోగక్షేమాలను బీవీ రాఘవులు అడిగి తెలుసుకున్నారు. ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ చైర్మన్ కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, సీపీఎమ్ రాష్ట్ర కార్యదర్శి బీ. బలరామ్, సీపీఎం పశ్చిమగోదావరి జిల్లా నాయకుడు కేతా గోపాలన్, తణుకు సీపీఎం నేత ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.పోలీసులు అందించిన వివరాలివి.. పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన చెరుకూరి అరుణ పిల్లవాడిని ఇంటి వద్ద వదిలిపెట్టి ఈ నెల 29వ తేదీ రాత్రి ఒంటి గంట సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాలేదని, చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో భర్త దుర్గారావు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

నెమ్మదిగా పెరుగుతున్న గోదావరి

● భయాందోళనకు గురవుతున్న తీర ప్రాంత ప్రజలు ● ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్న అధికారులు



సుడులు తిరుగుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

కొవ్వూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాలో భారీగా కురుస్తున్న వర్షాలతో అఖండ గౌతమీ గోదావరి ఉప్పొంగి ఉరకలు పెడుతోంది. దీంతో కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద గోదావరి వరద నెమ్మదిగా పెరుగుతోంది. క్షేత్రంలోని స్నానఘట్టాలు పూర్తిగా నీట మునిగాయి. మరో రెండు అడుగులు పెరిగితే క్షేత్రంలోని ఆలయాల చుట్టూ వరద నీరు వచ్చి చేరుతుంది. నదీ పరీవాహక ప్రాంతాలలోని వాగులు, వంకలు, ప్రాజెక్టుల నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో కొవ్వూరు, రాజమహేంద్రవరం మధ్య గోదావరి సుడులు తిరుగుతూ హోరున ప్రవహిస్తూ తీర ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాలలో మరలా వర్షాలు పడితే పరిస్థితులు మరింత ఆందోళనకరంగా ఉంటాయని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే గత 20 రోజులుగా గోదావరికి వరదలు వచ్చి ఏటిగట్లు నానుతున్నాయి. పటిష్టంగా ఉన్న ఏటిగట్లను ఇసుకర్యాంపుల పేరుతో ఎక్కడికక్కడ త్రవ్వేయడంతో వరద మరింత పెరిగితే గట్లు ఎక్కడ తెగిపడతాయోనని తీర ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గోష్పాదక్షేత్రంలో నదీలో ఎవ్వరిని దిగకుండా పోలీసు, ఫైర్ అధికారులతో టీములను ఏర్పాటుచేసి గస్తీ నిర్వహిస్తున్నారు. పిల్లగట్టు స్థాయికి పెరిగి ప్రవహిస్తున్న వరద గోదావరిని చూడడానికి పట్టణ పరిసర ప్రాంతాలనుంచి ప్రజలు అధికసంఖ్యలో గోష్పాదక్షేత్రానికి చేరుకుంటున్నారు. వారిని నిలువరించడం పోలీసులకు పెద్దపనిగా తయారయ్యింది. గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టాలు పూర్తిగా నీట మునిగాయి. క్షేత్రంలో సుందర సాయి మందిరం చుట్టూ వరద నీరు చేరింది.

ధవళేశ్వరం: ధవళేశ్వరం వద్ద గోదావరి నిదానంగా పెరుగుతూ ప్రవహిస్తుంది. శనివారం రాత్రి 9గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 11.75 అడుగులకు చేరుకుంది. ఆపై కొన్ని గంటలు పాటు నిలకడగా ఉండి 2, 3 గంటలకు ఒకపాయింట్ చొప్పున పెరుగుతూ ఆదివారం మధ్యాహ్నం నాలుగు గంటలకు 12.80 అడుగులకు చేరుకుంది.రాత్రి 7గంటలకు అదే రీడింగ్ వద్ద నిలకడగా కొనసాగుతుంది.ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 11,35,249 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తుంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 4700 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2300 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5500 క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

పెరవలి: గోదావరి ఎగువ భాగంలో వస్తున్న వరదతో ఈ ప్రాంతంలో కూడా వరద అంతకంతకూ పెరుగుతోంది. నాలుగు రోజుల క్రితం తగ్గుముఖం పట్టడంతో రైతులంతా ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ హఠాత్తుగా పెరగడంతో పల్లపు ప్రాంతాల్లోని లంకభూములు నీట మునిగాయి. దీంతో పశువుల మేతకు పచ్చగడ్డి పనికి రాకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తీపర్రు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

బాబు ష్యూరిటీ .. మోసం గ్యారంటీ

కొవ్వూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మద్దూరులో ఆదివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైసీపీ మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని విమర్శించారు. తోట నారాయణ, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్‌బాబు, పరిమి సోమరాజు, కవల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.